క్లుప్తంగా

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అద్దంకి రూరల్: గడ్డి మందు తాతాగి ఆత్మహత్య యత్నం చేసిన వివాహిత వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. విప్పర్లవారిపాలెం గ్రామానికి చెందిన గోసాల శ్రీనివాసరావు, విజయలక్ష్మి (45)లకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో చిన్నకుమార్తె 8 వ తరగతి చదువుతోంది. మంగళవారం కుమార్తె స్కూల్‌కు వెళ్లకపోవటంతో తల్లి విజయలక్ష్మి.. కుమార్తెను మందలించింది. ఈ విషయాన్ని సాయత్రం ఇంటికి వచ్చిన తండ్రి చెప్పింది. ఒక్కపూట స్కూల్‌కు పోకపోతే ఏమి అవుతుందని శ్రీనివాసరావు విజయలక్ష్మితో గొడవపడటంతో.. విజయలక్ష్మి గడ్డి మందు తాగింది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటపై ఎస్సై రవితేజ కేసు నమోదు చేశారు.

'లోకోస్' యాప్‌పై అవగాహన ఉండాలి



వీఓఏలకు శిక్షణ ఇస్తున్న డీఎంజీ

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐకేపీ అధికారులు తెలిపారు. బుధవారం కారంచేడు ఐకేపీ కార్యాలయంలో కారంచేడు, పర్చూరు మండలాలకు చెందిన వీఓఏలకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. లోకోస్ యాప్‌లో డ్వాక్రా మహిళల ఆర్థిక లావాదేవీలు మొత్తం నమోదు అయి ఉంటాయన్నారు. డీఎంజీ, ఏపీఎం, సీసీలు, డ్వాక్రా మహిళలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

చీరాల అర్బన్: చీరాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని క్రైం వివరాలను పరిశీలించారు. మద్యం షాపుల ఆఫ్ టేక్ వివరాలను గురించి వాకబు చేశారు. అనంతరం మద్యం షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. సరైన సమయానికి టార్గెట్స్ చేరుకోవాలని తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నాగేశ్వరరావు, మద్యం షాపుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శేషగిరిరావు

వేటపాలెం: ఐపీఎల్ క్రికెట్ సీజన్ జరుగుతున్నందును క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గతంలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వారికి బుధవారం రూరల్ సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా లేదా బెట్టింగ్‌లు కాసినా ఇద్దరిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎస్సై ఎస్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై ఆగిన సిమెంట్ లారీ



రోడ్డుపై నిలిచిపోయిన సిమెంట్ లోడు లారీ

పర్చూరు(చినగంజాం): యాక్సిల్ విరగడంతో ఓ సిమెంట్ లారీ రోడ్డుపై ఆగిపోయిన సంఘటన బుధవారం పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్ళే మార్గంలో చోటు చేసుకుంది. సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద హఠాత్తుగా యాక్సిల్ విరిగిపోవడంతో రోడ్డుపై అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోనప్పటికీ రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

యాప్‌లో అప్‌లోడ్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శివన్నారాయణ

ఇంకొల్లు(చినగంజాం): గ్రామ పంచాయతీలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం నుంచి అందాలంటే యాప్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి అని డీఎల్పీ బి. శివన్నారాయణ అన్నారు. బుధవారం పంచాయతీలను సందర్శించి పలు సూచనలు చేశారు. యాప్ అప్‌లోడ్ చేయకుంటే ప్రభుత్వం నుంచి అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు అందే పరిస్థితి లేదన్నారు. జీఆర్‌డీపీ ప్లాను ఈ గ్రామ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, గ్రామ పంచాయతీలు నూతన యాప్ విధానంలో అనుసంధానం చేయాలని సూచించారు. ఇంకొల్లు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అడ్డగడ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు లేదు..నీడా రాదు!

- మండుటెండలో ఉపాధి కూలీలు విలవిల
- 9 వారాలుగా అందని కూలి డబ్బు
- ఇబ్బందులకు గురౌతున్న కూలీలు



ఆరికట్లవారిపాలెంలో మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

జె.పంగులూరు: ఎండల్లో శ్రమించే ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. 9 వారాల నుంచి ఉపాధి కూలీలకు నగదు చెల్లించడం లేదు. మరో వైపు ఉపాధి హామీ కూలీలు మండుటెండలో మలమలా మాడిపోతున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఎండ తీవ్రత పెరగడంతో పని ప్రదేశాల్లో కూలీలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. నీడ కోసం పరదాలు ఇచ్చిన దాఖలాలు లేవు. కనీసం కూలి డబ్బులు కూడా అందకపోవడంతో పొయ్యి మీద నుంచి పెనంమీద పడినట్లైందని వాపోతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. కూలీలకు సక్రమంగా 100 రోజులు కూడా పని కల్పించడం లేదనే విమర్శలున్నాయి. వేసవి తీవ్రత నేపథ్యంలో మజ్జిగ, మంచి నీరు, టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు సమ్మర్ అలెవెన్స్‌లు కూడా అందించాల్సి ఉంది. రెండు పూటల పనివిధానం, ముఖం ఆధారిత హాజరు తీసివేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కనిపించని టెంట్లు, పట్టలు

ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కాలువల పనులు చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు పనులు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఎండల నుంచి ఉపసమనం కలిగించేందుకు టెంట్లు, పట్టలు పని ప్రదేశాల్లో ఉంచాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పరిస్థితి సరేసరి. తాగునీరు కూడా ఇంటి నుంచే తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు. మండలంలో 10004 జాబ్ కార్డులున్నాయి. కాగా పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

1600 మంది కూలీలు

ఉపాధి కూలీలు బకాయిలు చాలాకాలంగా చెల్లించడంలేదు. జనవరి 19 నుంచి వేతనాలు ఇవ్వలేదు. మండలంలో రోజుకు 1400 నుంచి 1600 మంది వరకు కూలీలు ప్రతి రోజూ పనిచేస్తుంటారు. కూలీలకు సరాసరిన రోజుకు రూ. 270 నుంచి 290 వరకు గిట్టుబాటు అవుతాయి.

> **కొంత మందికి అందాయి**
> జనవరి 19 నుంచి ఇంచుమించు 9 వారాలు పాటు కూలీలకు వేతనాలు ఆగినాయి. మండలంలో రోజుకు 1400 నుంచి 1600 వందల మంది ఉపాధి పనులు చేస్తుంటారు. వీరిలో అతి తక్కువ మందికే డబ్బులు పడ్డాయి. మిగిలిన వారికి కూడా పడతాయి.
> – సంతోషం: ఏపీఓ

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి సుధ

వేటపాలెం: విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. సుధ పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. బాలికలపై జరిగే అకృత్యాలపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. మన చుట్టూ ఉన్న మానవ మృగాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ గ్రేసమ్మ, పీఎల్‌వీలు ఎస్‌డీ మతీన్, ఎస్ఎం సుభాని, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా టంగుటూరి



టంగుటూరి ప్రకాశం

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా పట్టణానికి చెందిన టంగుటూరి ప్రకాశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్ను సంఘ నాయకులు వలివేటి సుబ్బారావు, కస్తూరి పద్మనాభ శర్మ, పొన్నలూరి కిరణ్‌కుమార్, రమణారావు, ఓరుగంటి శ్రీనివాసరావు, ఈదర శివప్రసాద్, చంద్రపాటి రుషి, కందికంటి విజయ్‌కుమార్, మణి అభినందించారు.

రసాయనిక ఎరువులతో నష్టం



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌వీపీ కుమారి

బల్లికురవ: వేసవిలో భూసార పరీక్షలతో పంటకు కావాల్సిన మోతాదులో ఎరువులు వాడాలని.. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. బుధవారం కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువు, పశువుల ఎరువులతో భూసారం పెంచు కోవాలన్నారు. ప్రతి సంవత్సరం పంట మార్పిడితో చీడ పీడల ఉధృతి తగ్గించుకోవచ్చన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి రబీ, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రయివేటు వ్యాపారులకు ధాన్యం తక్కువ ధరకు అమ్మి నష్ట పోవద్దని హెచ్చరించారు.

ఘనంగా అన్నమాచార్య ఆరాధన



అన్నమాచార్య విగ్రహానికి పూలమాలు వేస్తున్న కళాక్షేత్రం అధ్యక్షుడు

అద్దంకి రూరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 522వ ఆరాధన కార్యక్రమాన్ని బుధవారం దాసభారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి 32 వేలకు పైగా కీర్తనలు రచించారన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, దేవపాలన తదితరులు పాల్గొన్నారు.

అపరాలను తక్కువ ధరకు అమ్మవద్దు



బొద్దువానిపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో శ్రీనివాసరావు



పర్చూరు: అపరాలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



చీరాల రైతులతో మాట్లాడుతున్న వ్యవసాధికారులు

మేదరమెట్ల: శనగలు, మినుములను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే రైతులు అమ్ముకోవాలని.. తక్కువ ధరకు అమ్మవద్దని ఏఓ శ్రీనివాసరావు సూచించారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యర్రబాలెం, బొద్దువానిపాలెం గ్రామాల్లో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము క్వింటా రూ.5650, ఎర్ర శనగలు రూ.7550గా ప్రభుత్వం కొనుగోలు ధరను నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): రైతులకు అండగా అపరాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పర్చూరు ఏడీఏ ఎన్. మోహనరావు అన్నారు. మండలంలోని అడుసుమల్లి గ్రామంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రైమరీ అగ్రికల్చరల్ సొసైటీ ద్వారా బుధవారం అపరాలు కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అడుసుమల్లి సీఈఓ దొప్పలపూడి రమాదేవి ప్రారంభించారు. ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ పర్చూరు మండలంలోని అడుసుమల్లి, గొల్లపూడి, అన్నంబొట్లవారిపాలెం, వీరన్నపాలెం, బోడవాడ, రమణాయపాలెంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పీడీసీసీ బ్రాంచ్ మేనేజర్ విశ్వేశ్వరరావు, సూపర్ వైజర్ శ్రీనివాసరావు, కారుమంచి కృష్ణ, అడ్డగడ వేణు, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కాపు రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

చీరాల రూరల్ : మొక్కజొన్న సాగుచేసిన రైతులు పంట దిగుబడి పొందిన తరువాత మోడులను తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్నటం వలన భూమిలో సేంద్రియ పదార్థాలను పెంపొందించవచ్చునని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామాలలో నిర్వహించారు. వీఏఏలు శ్రావ్య, పావని, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

మార్టూరు: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం రాష్ట్ర జిల్లా అధికారులు పరిశీలించారు. స్టేట్ జనరల్ ఎగ్జామినేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మార్టూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైతన్య.. రాయల్ హై స్కూల్‌తో పాటు వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. జిల్లా 10వ తరగతి పరీక్షల నిర్వాహకురాలు గంగాభవాని మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. 953 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు గుర్తించారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్ కొట్టాలి

అద్దంకి రూరల్: వేసవి దృష్ట్యా విద్యార్థులకు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో వాటర్‌బెల్స్ కొట్టాలని ఎంఈఓ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఉదయం 10 గంటలకు, 11 గంటలకు, 12 గంటలకు ఒకసారి మంచినీరు తాగటానికి బెల్ కొట్టించాలని తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనుమానాలు



నిరసన తెలుపుతున్న పాస్టర్లు

చీరాల రూరల్: క్రీస్తు పరిచర్యలో ముందుంటూ మంచి విషయ పరిజ్ఞానం కలిగిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై అనుమానాలు ఉన్నాయని క్రైస్తవ సంఘాలకు చెందిన పాస్టర్లు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆవరణలో పాస్టర్లు దేటా దివాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రెవరెండ్ ముకిరి రత్నశేఖర్, జాలా రామారావు, నీలం శామ్యూల్ మోజెస్, యడం రవిశంకర్ మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దేవుని వాక్యాన్ని ఎంతో బలంగా వినిపిస్తున్నారని, అంతేకాక అంతర్జాతీయ సువార్తికులుగా మంచి ఖ్యాతి గడించారని చెప్పారు. క్రైస్తవ కూటముల్లో హాజరయ్యేందుకు వెళుతూ మృతి చెందారని, అయితే పోలీసులు మాత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా చెబుతున్నారని, ఆయన మృతి పట్ల అనేక అనుమానాలున్నాయని సమావేశానికి హాజరైన పాస్టర్లు ముక్తకంఠంతో అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. దేటా దివాకర్, ఎరిచర్ల మోహనరావు, బొనిగల పేతురుబాబు, పీటర్ రమేష్, పేర్లి రత్నరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగం అధ్యక్షుల నియామకం

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజక వర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షునిగా నలుగురిని నియామకం చేస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. పర్చూరు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షునిగా మొగిలి నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్‌వింగ్ అధ్యక్షునిగా టి. కృష్ణమోహన్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షునిగా కాటుకూరి బాబురావు, ఐటీ వింగ్ అధ్యక్షునిగా గుడా వెంకట కృష్ణారెడ్డి నియమించినట్లు ఉత్తర్వుల్లో వివరించారు.

న్యాయవాది హత్యకు నిరసనగా విధులు బహిష్కరణ

చీరాల రూరల్: హైదరాబాద్‌లో న్యాయవాది ఎర్రబాపు ఇశ్రాయేలు అనే న్యాయవాదిని కొందరు సంఘ విద్రోహ శక్తులు అతికిరాతంగా హత్య చేసినందుకు నిరసనగా బుధవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కొటిక ఉదయభాస్కరరావు మాట్లాడుతూ తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సరస్వతి విగ్రహానికి రంగులు



చినగంజాం: మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సరస్వతి దేవి విగ్రహానికి దాతలు రూ. 20 వేల సొంత నిధులతో రంగులు వేయించినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం డి. నారాయణ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రామదండు సేవా సమితి సభ్యులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శనరెడ్డి కార్యక్రమానికి దాతలుగా నిలిచారని తెలిపారు. గతంలో ఆగస్టు 15, జనవరి 26 జాతీయ పండగ దినోత్సవాలకు విద్యార్థులకు బహుమతులు అందించినట్లు చెప్పారు. పాఠశాల క్రీడా మైదానం, పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలకు వైద్య సేవలు ముఖ్యం



గుంటుపల్లిలో యాప్‌ను పరిశీలిస్తున్న విజయమ్మ

బల్లికురవ: గ్రామాల్లోని హెల్త్ క్లినిక్‌లు, వైద్యశాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటుతో వైద్యసేవలు అందిస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్. విజయమ్మ ఆదేశించారు. బుధవారం గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నక్కబొక్కలపాడు గ్రామంలోని హెల్త్ క్లినిక్‌లు తనిఖీ చేశారు. రికార్డులు జాతీయ హెల్త్‌మిషన్ ద్వారా అందుతున్న పలు కార్యక్రమాలను, వ్యాక్సిన్‌లు ఓపీలు ఫోన్ యాప్ ద్వారా నమోదు పరిశీలించి సంతృప్తి చెందారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్‌లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నోడల్ అధికారి బ్రహ్మం, వైద్యాధికారి రవితేజ పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



డాక్టర్ సౌమ్య

పర్చూరు(చినగంజాం): వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా వదులుగా ఉండే తెల్లటి దుస్తులు ధరించాలని పర్చూరు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య ప్రజలకు సూచించారు. బుధవారం ఆసుపత్రికి వచ్చిన రోగులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న కారణంగా వృద్ధులు, పిల్లలు బయటికి వెళ్ళొద్దని సూచించారు. అత్యవసరంగా బయటకు వెళ్ళేవారు తమతో పాటు మంచినీరు మజ్జిగలను తీసుకొని వెళ్ళాలన్నారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు వేసవిలో గంటకు ఒకసారి శీతల పానీయాలు తీసుకుంటూ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రతి ఒక్కరూ 3 నుంచి 5 లీటర్ల నీటితో పాటు అదనంగా కొబ్బరి, బార్లీ నీటిని కూడా తాగాలన్నారు. వాంతులు, కళ్లు తిరగటం వంటి లక్షణాలున్న వారు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్ళాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి మట్టి నమూనా పరిశీలన



వల్లా పల్లి మట్టినమూనాలు సేకరిస్తున్న దృశ్యం

బల్లికురవ: అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం మట్టి నమూనాల సేకరణ చేపట్టారు. బల్లికురవ-అద్దంకి, ఆర్ అండ్‌బీ రోడ్డులో బ్రాంచ్ కాలువను దాటే చోట జీర్ణావస్థకు చేరిన తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో ప్రపంచ బ్యాంకు నిధులతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా నిర్మాణ పనులకు సంబంధించి మట్టినమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. టెండర్లు పిలిచి వేసవి నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత



హెచ్ఎంకు రూ. 50 వేలు చెక్కు అందిస్తున్న సుబ్బారావు

వేటపాలెం: పాఠశాలల అభివృద్ధికి పట్టభద్రుల సంఘం చేయూత అందిస్తోందని పట్టబధ్రుల సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు తెలిపారు. దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరి పట్టణంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరి గేట్లు నిర్మాణం కోసం పట్టభద్రుల సంఘం రూ. 50 వేలు ఆర్థిక చేయూత బుధవారం అందజేశారు. అధ్యక్షుడు మాట్లాడుతూ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ప్రహరీ గేట్ల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారని తెలిపారు. దీంతో రూ. 50 వేలు పట్టభద్రుల సంఘం నుంచి అందించారని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి తమ సంఘం కృషి చేస్తుందని చెప్పారు. సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శి చుండూరి నాగాంజనేయులు, ఫౌండర్ మెంబర్ చుండూరి మురళీకృష్ణ, ప్రత్తి గౌరీషు, మురళీకృష్ణ, శరత్ బాబు, శ్రీమన్నారాయణ, ముంగర వెంకట్, పూల శ్రీనివాసరావు, అమరా హరి పాల్గొన్నారు.

శనగ పంటకు మద్దతు ధర



జరుబులవారిపాలెంలో మాట్లాడుతున్న ఏఓ సుధీర్‌బాబు

జరుబులవారిపాలెం (కారంచేడు): ఈ ఏడాది శనగ పంటను సాగు చేసిన అన్నదాతలు ఎవరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారి కె. సుధీర్ బాబు తెలిపారు. బుధవారం నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులను అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసి పండించిన శనగ పంటలను రైతులు తప్పకుండా మీ సమీప కొనుగోలు కేంద్రాలలోనే అమ్మకాలు చేపట్టాలని కోరారు. క్వింటా రూ 5650లకు మండలంలోని నాయుడువారిపాలెం, దగ్గుబాడు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)ల ద్వారా కొనుగోళ్లు ప్రారంభిమని తెలపారు. దళారుల మాటలు నమ్మి వ్యాపారలకు తక్కువ ధరలకు అమ్ముకోవడం వలన రైతులు నష్టపోతారాన్నరు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు తప్పకుండా వ్యవసాయ భూములకు యూనిక్ నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు కిషోర్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగునికి గాయాలు



గాయాలపాలైన వికలాంగుడు

అద్దంకి రూరల్: మూడు చక్రాల స్కూటీ అదుపు తప్పటంతో వికలాంగుడికి గాయాలైన సంఘటన అద్దంకి పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన అన్నపురెడ్డి మస్తాన్ (వికలాంగుడు) తన మూడు చక్రాల స్కూటీపై దర్శి వెళుతున్నాడు. ఈక్రమంలో మార్గ మధ్యంలోని అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ సమీపంలోకి రాగానే స్కూటీ అదుపుతప్పటంతో కింద పడి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.